ఇంజాపూర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

తుర్కయాంజాల్, డిసెంబర్ 15 : మున్సిపాలిటీ పరిధిలోని ఇంజాపూర్‌లో రూ.2.91 కోట్లతో చేపట్టనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులకు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆదివారం శంకుస్థాపన చేశారు. అనంతరం కాలనీ వాసులు ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తుర్కయాంజాల్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ, వైస్ చైర్‌పర్సన్ హరిత, కౌన్సిలర్లు అయిలయ్య, రవీందర్ రెడ్డి, శ్రీలత, కమిషనర్ అమరేందర్‌రెడ్డి, డీఈ భిక్షపతి, నాయకుడు ధన్‌రాజ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం మహాసభలను విజయవంతం చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న యాదయ్య

తుర్కయంజాల్,డిసెంబర్ 15: మున్సిపాలిటీ పరిధిలో ఈ నెల 19న జరగనున్న సీపీఎం తుర్కయాంజాల్ ప్రథమ మహాసభను విజయవంతం చేయాలని పార్టీ కార్యదర్శి వర్గ సభ్యుడు పగడాల యాదయ్య అన్నారు. ఆదివారం రాగన్నగూడలోని పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం మండల అధ్యక్షుడు సత్యనారాయణ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన యాదయ్య మాట్లాడుతూ.. ఈ మహాసభలకు పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యుడు కిషన్, నాయకులు భాస్కర్, శ్రీరామ్మూర్తి, అరుణ్‌కుమార్, శంకరయ్య, ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణపై మాట తప్పిన కాంగ్రెస్

పెద్దఅంబర్‌పేట, డిసెంబర్ 15 : సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఏబీసీడీ వర్గీకరణ చేయాలని అబీఆర్ఎస్ పార్టీ అబ్దుల్లాపూర్‌మెట్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు నల్లోల పాండు అన్నారు. వచ్చే అసెంబ్లీలో ఏబీసీడీ వర్గీకరణ తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. కులగుణన ఆధారంగా మాదిగల వాటా తమకు ఇవ్వాలన్నదే డిమాండ్ అన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంలో ఎమ్మార్పీఎస్ వర్గీకరణపై పార్లమెంట్‌లో గొంతు వినిపించారని గుర్తు చేశారు. సుప్రీం కోర్టు తీర్పును రాష్ట్ర ప్రభుత్వం అనుసరించాలని కోరారు. ఇచ్చిన మాట తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం మాల సోదరులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. వర్గీకరణ తర్వాతే ఉద్యోగ నోటిఫికేషన్లు ఇస్తామని మాయమాటలు చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి పాత రిజర్వేషన్ ప్రకారం ఉద్యోగాలు భర్తీ చేస్తున్నారని మండిపడ్డారు.

బెల్టు షాపుల జోరు

- గ్రామాల్లో దుకాణాల హవా
- అధిక ధరలకు మద్యం విక్రయాలు
- నిద్రమత్తులో ఎక్సైజ్, పోలీసు అధికారులు

యాచారం, డిసెంబర్ 15 : మండల పరిధిలో అనుమతులు లేకుండా అక్రమంగా మద్యం విక్రయాలు జోరుగా కొనసాగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో బెల్టు షాపుల హవా కొనసాగుతున్నది. మద్యం విక్రయదారులు ఎమ్మార్పీపై రూ.30నుంచి రూ.40వరకు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. గుట్టు చప్పుడు కాకుండా మద్యం బాటిళ్లు, బీరు బాటిళ్లను అధిక ధరలకు విక్రయించి జేబులు నింపుకొంటున్నారు. మండల పరిధిలో 24 గ్రామ పంచాయతీలు, వాటి అనుబంధ గ్రామాల్లో సమారు 250కి పైగా బెల్టు షాపులున్నాయి. మామూళ్ల మత్తులో మునిగి నిద్రావస్థలో ఉన్న అటు ఎక్సైజ్, ఇటు పోలీసులు చూసీ చూడనట్టుగా వదిలేయడంతో మద్యం విక్రయదారుల వ్యాపారం మూడుపువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతున్నది. దీంతో అర్ధరాత్రి సైతం మద్యం అందుబాటులో ఉండటంతో అధిక ధరలకు సైతం విక్రయించి మద్యానికి బానిసవుతున్నారు. యువతతో పాటు విద్యార్థులు సైతం మద్యం మత్తులో మునిగి తేలుతున్నారు. బంగారం లాంటి తమ భవిష్యత్తును కొంత మంది విద్యార్థులు, నిరుద్యోగులు, యువకులు మద్యానికి తాకట్టు పెడుతున్నారు.

రహస్యంగా విక్రయాలు

మద్యం ధరలు బెల్టు షాపుల్లో చుక్కలనంటుతున్నాయి. రహస్యంగా విక్రయించే మద్యం ధరలు పోటెత్తుతున్నాయి. వైన్స్ ధరలతో పోలిస్తే రూ.30నుంచి రూ.40వరకు అధిక ధరలకు విక్రయిస్తూ ఖజానా నింపుకొంటున్నారు. ఒక్కో క్వార్టర్ బాటిల్ వెనుక రూ.30నుంచి రూ.40, మద్యం బీరు బాటిల్ వెనుక రూ.25నుంచి రూ.30కి అధిక ధరలకు విక్రయిస్తారు. మండల కేంద్రం మినహా మేడిపల్లి, నందివనపర్తి, మంతన్‌గౌరెల్లి, కొత్తపల్లి, తాడిపర్తి, కుర్మిద్ద, నానక్‌నగర్, చింతుల్ల, చౌదర్‌పల్లి గ్రామాల్లో సమారు 10కి పైగానే బెల్టు షాపులున్నాయి. గున్‌గల్, తమ్మలోనిగూడ, చింతపట్ల, నల్లవెల్లి, మొండిగౌరెల్లి, నజ్దిక్‌సిగారం గ్రామాల్లో ఎనిమిది బెల్టు షాపులున్నాయి. అయ్యవారిగూడ, మల్కీజ్‌గూడ, ధర్మన్నగూడ, గడ్డమల్లాయగూడ, తక్కళ్లపల్లి, గాండ్లగూడ, మొగుళ్లవంపుతో పాటు గిరిజన తండాల్లో మూడు కంటె ఎక్కువగా బెల్టు షాపులు జోరుగా కొనసాగుతన్నాయి. మేడిపల్లి నక్కర్తలోనే అక్రమంగా మద్యం విక్రయాలు అధికంగా కొనసాగుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు.

జోరుగా గుడుంబా విక్రయాలు

మండల పరిధిలో మళ్లీ గుడుంబా గుప్పుమంటున్నది. తండాల్లో గిరిజనులు వ్యవసాయ పొలాల వద్ద నాటు సారాయిని తయారుచేసి చుట్టు పక్కల గ్రామాల్లో విక్రయించి డబ్బులు సంపాదిస్తున్నారు. వృద్ధులతో పాటు యువకులు సైతం గుడుంబాకు బానిసవుతున్నారు. గుడుంబాతో తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. మండల పరిధిలోని మంథన్‌గౌరెల్లి, తక్కళ్లపల్లితండా, ఏనెకిందితండా, బొల్లిగుట్టతండా, పల్లెచెల్కతండా, కుర్మిద్దతండాల్లో రహస్యంగా గుడుంబాను తయారుచేసి విక్రయిస్తున్నారు, పోలీసులు దృష్టి సారించి గుడుంబా విక్రయాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

యువత చిత్తు

మద్యం మత్తులో యువత చిత్తవుతున్నది. పట్టుమని పదిహేనేండ్లు నిండక ముందే మద్యానికి బానిసవుతున్నారు. ఒకరిని చూసి మరొకరు మద్యాన్ని తాగుతున్నారు. విందులు, వినోదాలు, సంబరాలు, ఉత్సవాలు, పండుగ సమయాల్లో గ్రామాల్లోని యువత మద్యం సేవించి భవిష్యత్తును బుగ్గి చేసుకుంటున్నారు. ఇప్పటికే కొంత మంది మద్యానికి బానిసై చివరకు అనారోగ్యానికి గురై మృతి చెందిన ఘటనలు ఉన్నాయి.

పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు (ఫైల్)

బెల్టు షాపులపై చర్యలు తీసుకుంటాం

అక్రమంగా నిర్వహిస్తున్న బెల్టు షాపులపై తగిన చర్యలు తీసుకుంటాం. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. గ్రామాల్లో అవగాహన కోసం సమావేశాలు నిర్వహిస్తున్నాం. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి. పీఎస్ పరిధిలో అక్రమంగా మద్యం, గంజాయి, డ్రగ్స్, మాదక ద్రవ్యాలు విక్రయిస్తే పోలీసులకు సమాచారం అందించాలి. నిందితులను చట్టపరంగా శిక్షిస్తాం.

- కృష్ణంరాజు, హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పీఎస్

కిరాణ కొట్టులే.. బెల్టు షాపులు

మండల పరిధిలో అధికంగా కిరాణా షాపుల్లోనే బెల్టు షాపులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. కిరాణ సామానుతో పాటు, వైన్స్‌లో మద్యం కొనుగోలు చేసి దర్జాగా విక్రయిస్తుంటారు. విక్రయించే మద్యాన్ని, ఇంట్లో, పక్కింట్లో, కార్లలో పెట్టి విక్రయిస్తారు. గిరాకీ రాగానే గుట్టు చప్పుడు కాకుండా రహస్యంగా విక్రయిస్తారు. మండల పరిధిలోని మాల్, యాచారం, గున్‌గల్, మేడిపల్లిలో వైన్స్ షాపుల్లో మద్యం కొనుగోలు చేసి గ్రామాల్లో అక్రమంగా అధిక ధరలకు విచ్చలవిడిగా విక్రయిసున్నారు. పోలీసులు కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపినా.. తిరిగొచ్చిన తర్వాత మళ్లీ దందా కొనసాగిస్తూనే ఉన్నారు. గ్రామాల్లో మద్యం విక్రయించే కిరాణా దుకాణాలు, ఇండ్లపై నిఘా పెట్టి బెల్టు షాపుల నిర్వహణపై తగిన చర్యలు తీసుకోవాలని, అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రజలు కోరుతున్నారు. బెల్టు షాపుల బారి నుంచి తమ పిల్లల భవిష్యత్తును కాపాడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఏడుగురు పేకాట రాయుళ్ల అరెస్ట్

ఆదిబట్ల, డిసెంబర్ 15 : పేకాట శిబిరంపై ఎస్‌వోటీ పోలీసులు దాడి చేసి ఏడు గురిని అరెస్ట్ చేసిన ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. నాదర్‌గుల్ ప్లాటినం సిటీలో కొందరు పేకాట ఆడుతున్నారని సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడికి వెళ్లి పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఏడు గురిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.58,710 నగదు,7 సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

వ్యవసాయ సబ్ మార్కెట్ యార్డు ఏర్పాటుకు కృషి

కడ్తాల్, డిసెంబర్ 15 : మండల పరిధిలోని రైతుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని కడ్తాల్ మండల కేంద్రంలో వ్యవసాయ సబ్ మార్కెట్ యార్డు ఏర్పాటుకు కృషి చేస్తానని ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. మండల కేంద్రంలో సబ్ మార్కెట్ యార్డు లేకపోవడంతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కడ్తాల్ పట్టణంలో మార్కెట్ యార్డు ఏర్పాటు చేయాలని ఎన్నో ఏండ్లుగా రైతులు ఎదురు చూస్తున్నారని, వారి కోరిక మేరకు మార్కెట్ యార్డు ఏర్పాటు కృషి చేస్తామని పేర్కొన్నారు. త్వరలోనే వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించి, మార్కెట్ యార్డు ఏర్పాటుపై చర్చించి తీర్మానం చేస్తామన్నారు. సబ్ మార్కెట్ యార్డు ఏర్పాటుకు కావాల్సిన భూముల కోసం సంబంధిత అధికారులను కలిసి చర్చిస్తామన్నారు. పట్టణానికి చేరువలో ప్రభుత్వ భూమి అనుకూలంగా ఉంటే వాటిని పరిశీలిస్తామని వివరించారు. సమస్యను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డితోపాటు సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్తామని, మండల కేంద్రంలో సబ్ మార్కెట్ ఏర్పాటు చేసి రైతుల కోరికను నెరవేరుస్తామని తెలిపారు. కార్యక్రమంలో గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, నాయకుడు లక్ష్మణ్‌నాయక్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి

అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించండి

పెద్దఅంబర్‌పేట, డిసెంబర్ 15: మున్సిపాలిటీ పరిధిలోని తట్టిఅన్నారం, శివారు కాలనీల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించాలని సెంట్రల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ భాస్కరాచారి అన్నారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిశారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం కోసం టెండర్లు పిలవాలని మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డిని ఎమ్మెల్యే ఆదేశించారని చెప్పారు. కార్యక్రమంలో మధు, ఫణిరెడ్డి, మానయ్య, శంకర్, వీరారెడ్డి, సీతారామ్‌రెడ్డి, లక్ష్మణ్‌చారి, రవి తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గీతానర్సింహను సన్మానిస్తున్న నాయకులు

వ్యవసాయ మార్కెట్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

కడ్తాల్, డిసెంబర్ 15 : ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గీతానర్సింహ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని మక్తమాదారంలో మాజీ సర్పంచ్ సులోచనాసాయిల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మార్కెట్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన గీతానర్సింహను స్థానిక నాయకులు, గ్రామస్తులు సన్మానించారు. మార్కెట్‌లో రైతులకు మెరుగైన వసతులు కల్పించాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మంజులాచంద్రమౌళి, మాజీ ఉప సర్పంచ్ గణేశ్, బీఆర్ఎస్ పార్టీ గ్రామాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ నర్సింహాగౌడ్, నాయకులు కృష్ణయ్య, యాదగిరి, మహేందర్‌గౌడ్, అనిల్‌కుమార్, సువర్ణ, కవిత, నారాయణ, శ్రీకాంత్, బాలరాజు, నరేశ్‌గౌడ్, చందు, భిక్షపతి, రమేశ్, చెన్నయ్య, యూసుఫ్, నారాయణగౌడ్, ప్రభాకర్‌గౌడ్ పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలి

ప్రొద్దటూరు రోడ్డులో నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు, నాయకులు

చేవెళ్ల రూరల్, డిసెంబర్ 15 : పొద్దటూరు గ్రామం నుంచి మేడిపల్లి గేట్ వరకు, పొద్దటూరు నుంచి టంగుటూరు (ఈర్లపల్లి గేట్) వరకు ప్రధాన రోడ్డు అధ్వానంగా తయారైంది. ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం గ్రామస్తులు, స్థానిక నాయకుల ఆధ్వర్యంలో రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోడ్డు గుంతలయంగా మారడంతో ప్రయాణించలేని దుస్థితి నెలకొందని పలు మార్లు అధికారులు, ఎమ్మెల్యేకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. ఎమ్మెల్యే, అధికారులు స్పందించి వెంటనే రోడ్డు పనులను చేపట్టాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ధర్నా చేపడతామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ శంకర్‌పల్లి మండల అధ్యక్షుడు గండిచెర్ల గోవర్ధన్ రెడ్డి, నాయకులు బి.వెంకట్‌రెడ్డి, పట్నం మోహన్ రెడ్డి, పి.రఘుపతిరెడ్డి, పట్నం రాజిరెడ్డి, పి.గోపాల్ రెడ్డి, రజనీకాంత్ రెడ్డి, గ్రామస్తులు మేకల గోపాల్ రెడ్డి, కవేలి జంగారెడ్డి, పి.అబ్బాస్ స్వామి, పి.శ్రీనివాస్ రెడ్డి, మేకల రఘుపతి రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, మాజీ ఉప సర్పంచ్ మల్లారెడ్డి, సురకంటి, చాకలి వెంకటేశ్, సంజీవ రెడ్డి, వార్డు సభ్యులు నర్సింహులు, రామ్ రెడ్డి, కె.గోవర్ధన్ రెడ్డి, మాణిక్యం, చాకలి రాములు, వడ్ల వీరయ్య, పి.జనార్దన్ రెడ్డి, ఏ.బాల్ రెడ్డి, నర్సింహారెడ్డి, యాదిరెడ్డి, సుధాకర్ రెడ్డి, రాజు, లక్ష్మణ్, బ్రహ్మం. సీహెచ్ నర్సింహులు, నక్క అమర్, సింహం, కొండకల్ శ్రీకాంత్, తలారి శ్రీనివాస్, ఎల్.కుమార్, పాండుగౌడ్, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పత్రీజీ ధ్యాన మహాయాగాలను సక్సెస్ చేయండి

సమావేశంలో మాట్లాడుతున్న పిరమిడ్ స్పిరిచ్యువల్ మూవ్‌మెంట్ ఆల్ ఇండియా కో-ఆర్డినేటర్ మాధవి

కడ్తాల్, డిసెంబర్ 15 : మండల పరిధిలోని మహేశ్వర మహా పిరమిడ్‌లో ఈ నెల 21 నుంచి 31 వరకు మహా పిరమిడ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న పత్రీజీ-ధ్యాన మహాయాగాలను విజయవంతం చేయాలని పిరమిడ్ స్పిరిచ్యువల్ మూవ్‌మెంట్ ఆల్ ఇండియా కో-ఆర్డినేటర్ మాధవి కోరారు. ఆదివారం మహేశ్వర మహా పిరమిడ్ ఆవరణలో పిరమిడ్ నిర్వాహకులతో కలిసి ధ్యాన మహాయాగానికి సంబంధించిన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ.. సుభాశ్ పత్రీజీ 2012లోనే డిసెంబర్ 21ని ధ్యాన దినోత్సవంగా ప్రకటించి, పదకొండు రోజులపాటు ధ్యాన కార్యక్రమాలను నిర్వహించారని తెలిపారు. ఐక్యరాజ్య సమితి సైతం ధ్యానం అవశ్యకతను గుర్తించి, డిసెంబర్ 21న ప్రపంచ ధ్యాన దినోత్సవంగా ప్రకటించడంపై పీఎస్ఎస్ఎం హర్షం వ్యక్తం చేస్తున్నదని పేర్కొన్నారు. ధ్యాన మహాయాగాలకు వచ్చే వారి కోసం అన్ని రకాల వసతులు ఏర్పాటు చేశామని ఆమె వివరించారు. కార్యక్రమంలో పిరమిడ్ ట్రస్ట్ సభ్యులు, మాస్టర్లు, నిర్వాహకులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పంచాయతీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గ్యార పాండు

ఆమనగల్లు, డిసెంబర్ 15 : రాష్ట్రంలోని గ్రామ పంచాయతీ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని గ్రామ పంచాయతీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గ్యార పాండు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆమనగల్లులోని ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాల పరిధిలోని పంచాయతీ కార్మికుల ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులందరినీ పర్మినెంట్ చేయడంతో పాటు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. జీవో నంబర్ 51ని సవరించి మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. కారోబార్ బిల్ కలెక్టర్లకు ప్రత్యేక హోదా కల్పించి జీవో నంబర్ 60 ప్రకారం కేటగిరీల వారీగా వేతనాలు చెల్లించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలన్నారు. పలు డిమాండ్లతో ఈ నెల 17న చలో హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద మహాధర్నాకు పిలుపునిచ్చినట్లుతెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ ఏరియా కన్వీనర్ పెంటయ్య, నాలుగు మండలాల యూనియన్ అధ్యక్షులు, కార్యదర్శులు పాండు, పర్వతాలు, లక్ష్మణ్‌నాయక్, కుమార్, ఆశీర్వాదం, కృష్ణ, జంగయ్య, లాలయ్య, రాములు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

పెద్దఅంబర్‌పేట, డిసెంబర్ 15: ప్రమాదాల నివారణ కోసం మున్సిపాలిటీలోని పలు చోట్ల ట్రాఫిక్ బారి కేడ్లను ఏర్పాటు చేయించినట్టు ద గోల్డెన్ మ్యాక్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ ఫౌండర్, ఎండీ మడిపల్లి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం సొసైటీ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కొత్త సంవత్సరంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతామని వెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, విజయ్‌భాస్కర్‌రెడ్డి, సొసైటీ ప్రతినిధులు బొర్ర భారతి, శోభ, విజయలక్ష్మి, సవిత, ఉమ తదితరులు పాల్గొన్నారు.

పెంటయ్యకు బహుజన సాహిత్య అకాడమీ అవార్డు

బహుజన సాహిత్య అకాడమీ అవార్డు అందుకుంటున్న పెంటయ్య గౌడ్

చేవెళ్ల రూరల్, డిసెంబర్ 15 : చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్‌కు బహుజన సాహిత్య అకాడమీ అవార్డు వరించింది. ఈ మేరకు ఆదివారం ఢిల్లీలో బీఎస్ఏ చైర్మన్ నల్లా రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి సుబ్రమణియన్ ఆయనకు అవార్డు అందజేశారు. సమాజ సేవ, వివిధ రంగాల్లో రాణిస్తున్న వారికి ఈ అవార్డు అందజేస్తుంటారు. పెంటయ్య గౌడ్ చేస్తున్న సమాజ సేవకు ఈ అవార్డు రావడంపై పలువురు ప్రముఖులు ఆయనను అభినందించారు.

భజన మండలి సభ్యులకు ఆర్థిక సాయం

భజన మండలి సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న కృష్ణమోహన్ ముదిరాజ్

చేవెళ్ల రూరల్, డిసెంబర్ 15 : మండల పరిధిలోని పామెన గ్రామంలో శుక్లపక్షం మోక్ష ఏకాదశి సందర్భంగా 41రోజులు భజన మండలి సభ్యులు భక్తిశ్రద్ధలతో భజనలు నిర్వహించారు. ఆదివారం ముగింపు రోజు సందర్భంగా బీజేపీ యువ మోర్చా ఉపాధ్యక్షుడు కృష్ణమోహన్ ముదిరాజ్ భజన మండలి సభ్యులను సన్మానించి రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో భజన మండలి సభ్యులు రాములు, నర్సింహులు, గోపాల్, శేఖర్, రాంచంద్రయ్య, అంజయ్య, శివనాగం, ఆత్మలింగం, సదానందం, శ్రీశైలం, ప్రసాద్ కుమార్, విజయ్, రవి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

ఉచిత వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ల బృందం

మైలార్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 15: ప్రస్తుత యాంత్రిక జీవనంలో ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందని ఆపద్బాంధవ సేవా సమితి అధ్యక్షుడు కె.రవీందర్‌గౌడ్ అన్నారు. కాటేదాన్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ల బృందం ప్రజలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి మందులను పంపిణీ చేశారు. అనంతరం సేవా సమితి అధ్యక్షుడు కె.రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ ఆపద్బాంధవ సేవా సమితి ఆధ్వర్యంలో పేద ప్రజల కోసం అనేక కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ఎప్పటికప్పుడు మురికి వాడలను గుర్తించి ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి వారికి మందులను పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ ఫిజిషియన్ డాక్టర్ సంతోష్‌కుమార్, కార్డియాలజిస్ట్ డాక్టర్ ఆరీఫ్, ఆర్థోపెడిక్ డాక్టర్ అబ్దుల్ జీహాన్, గైనకాలజిస్ట్ డాక్టర్ వెన్నల, సేవా సమితి జాయింట్ సెక్రటరీ బాలిరామ్ పాల్గొన్నారు.

ఆరెంజ్ అవెన్యూస్ వెల్ఫేర్ కమిటీ ఎన్నిక

తుర్కయాంజాల్, డిసెంబర్ 15 : మున్సిపాలిటీ పరిధిలోని ఏవీ నగర్ ఫేజ్-2 ఆరెంజ్ అవెన్యూస్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆదివారం కాలనీ సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ మేరకు సంఘం అధ్యక్షురాలిగా నవనీత, ఉపాధ్యక్షుడిగా వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ప్రణీత్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా దోనదుల వెంకటయ్య, కోశాధికారిగా ఆదిరాము, కార్యనిర్వహక సభ్యులుగా నరేంద్ర, మోహన్, సంతోష్‌కుమార్, ప్రకాశ్‌రెడ్డి, వేంకటేశ్వర్ రావు, వెంకటేశ్, నరేశ్, రోహిత్ కుమార్, బాల సతీశ్, సంజయ్, రమేశ్, వెంకట్‌రెడ్డి, బాబురావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షురాలు నవనీత మాట్లాడుతూ.. కాలనీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మాడ్గుల, డిసెంబర్ 15 : మండల పరిధిలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ మండల అధికారి శ్రీనివాస్ తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా కరెంటు సరఫరాను నిలిపివేస్తున్నామని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వ్యక్తికి గాయాలు

మాడ్గుల, డిసెంబర్ 15 : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. ఆమనగల్లులోని శాంతినగర్ కాలనీకి చెందిన పల్లె జంగయ్య (48) ఆదివారం దేవరకొండ నుంచి ఆమనగల్లుకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. మండల పరిధిలోని ఇర్విన్ జిల్లా పరిషత్ హైస్కూల్ వద్దకు రాగానే ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి.